# మహాభిషుడు

బ్రహ్మ సభ తీర్చాడు. దేవర్షిగణంతో, దేవలోకాన్ని చేరిన మహర్షి గణంతో సభ కిక్కిరిసి ఉంది. సృష్టికర్తని సేవించటం భాగ్యంగా భావించిన వారంతా భక్తితత్పరతతో అక్కడికి చేరారు.

ఉన్నట్టుండి అక్కడి వాతావరణంలో ఏదో మార్పు గోచరించింది. వాయు వీచికలు ఆ ప్రాంతమంతా నిండిపోయాయి. వాయుదేవుడు అంతటా తానేయై బ్రహ్మను కొలుస్తున్నాడా అన్నభావం కలిగేట్టుగా ఉంది అక్కడి పరిస్థితి.

వాయుదేవుని సేవకు తోడైనట్టుగా మధురమైన ధ్వని ఎటునించో వచ్చి ఆ ప్రాంతం అంతా వ్యాపించింది. లయకు తోడై రాగం కలిసినట్టుగా వినిపించింది అక్కడందరికీ. కానీ ఏ దిక్కునుంచి వస్తోందో తెలియలేదు ఎవ్వరికీ. బ్రహ్మదేవార్చనార్థులై అక్కడి వాళ్ళ దృష్టి బ్రహ్మ పాదాలపైనే ఉంచారు. బ్రహ్మదేవుడు మహదానంద భరితుడు కాగా, సదా బ్రహ్మను సేవించే వాయు దేవుడు భక్తిపారవశ్యంతో మైమరిచాడు. సభాసదుల్ని ఆనంద వరదాలన్న భావంతో విజృంభించాడు.

అప్పుడే దేవగంగ బ్రహ్మసభని సమీపిస్తోంది. వాయువీచికలు అధికంగా వీచాయి. ఆ స్థితి గమనించకుండానే వేగంగా ముందు కొచ్చింది గంగ. ఆమె దృష్టి అంతా బ్రహ్మ పాదాలపైనే ఉంచి. ఆమె ప్రతి కదలికా అప్రయత్నంగా తాళలయాన్వితమైంది. ఆమె కురులు గాలిలో అల్లల్లాడాయి. ఆ కురుల సందుల దాగిన గాలి నుంచి, సహస్రతంత్రులు సున్నితంగా సుమధురంగా మీటుతున్న ధ్వని వినవస్తోంది. ఆమె పాదమంజీరాల నవ్వడి ఆ ధ్వనితో కలిసిపోయి శ్రవణపేయమైంది. బ్రహ్మ, సభాసదులు అనిర్వచనీయమైన ఆనందతరంగాల్లో ఓలలాడారు.

బ్రహ్మను వీక్షిస్తూ దేవగంగ అడుగు ముందుకు వేసింది. భక్తిపారవశ్యంతో ఆమె ఎవరినీ గమనించటంలేదు. అంతకుమించిన భక్త్యావేశంతో వాయుదేవుడు బ్రహ్మదేవుణ్ణి సేవిస్తున్నాడు.

గంగ సమీపిస్తుంటే ఆమెను రెప్పపాటు లేకుండా వీక్షిస్తున్నది ఒక్కడే. అతనే మహాభిషుడు. ఇక్ష్వాకు వంశంలో జన్మించిన కీర్తివంతుడు. యజ్ఞ యాగాదులు చేసి పుణ్యం సంపాదించిన ధన్యజీవి. దేవతలను మెప్పించి, దేవర్షి గణంతో పాటు బ్రహ్మను సేవించడానికొచ్చాడు.

దేవగంగ బ్రహ్మసభను చేరుతుంటే ఆమె కురుల సౌందర్యాన్ని విస్తుపోయి చూసినవాడు మహాభిషుడే. వాయుదేవుని ఉద్ధృత వేగానికి గంగ పయ్యెద తొలగితే ఆ కుచద్వయ సౌందర్యాన్ని వీక్షించిందీ మహాభిషుడే.

వాయువేగానికి గంగ కటివస్త్రం సడలింది. నగ్నంగా ఊరువులు కనబడగానే అక్కడి దేవర్షి గణం అంతా పరాఙ్ముఖులయ్యారు. మహాభిషుడు ఆమెను సాభిలాషతో చూస్తున్నాడు. అతని శరీరం పులకాంకితమైంది.

ఆహా! ఎంతటి సౌందర్యవతి దేవగంగ. సౌందర్యాన్ని తను సంపూర్ణంగా చూడగలగటం తన అదృష్టం. భూలోకంలో తను ఎడతెగకుండా చేసిన యజ్ఞ యాగాదుల ఫల మిది.

దేవగంగ బ్రహ్మను సమీపించి ఆయన పాదాలకు మొక్కింది. బ్రహ్మ చూపు గంగపైన లేదు. మహాభిషుని వంక బ్రహ్మ చూపు నిలిచింది. మహాభిషుడు దేవగంగను నఖశిఖపర్యంతం చూస్తూ ఆ సౌందర్యాస్వాదనాలోలుడై మైమరిచాడు. మహాభిషుడు తనవైపే చూడటం గమనించిన దేవగంగ, సిగ్గుతో తన వస్త్రాన్ని సరిచేసుకుంది. మహాభిషుడు చిరునవ్వు నవ్వాడు. దేవగంగని మరింత మన్మథపరవశుడై తిలకించాడు.

బ్రహ్మ చూపులను తీక్షత ఆవరించింది. అది ఆగ్రహమైంది. అంతవరకు ఆయన మనసులో ఉన్న ఆహ్లాదం ఆ క్షణంలో అదృశ్యమైంది. మహాభిషుడు తన పట్ల చూపుతున్న భక్తి కంటే, ఆ దేవగంగ సౌందర్యంపైన చూపుతున్న రక్తే మరీ ఎక్కువ అనిపించింది బ్రహ్మకు.

"మహాభిషా!"

బ్రహ్మ గొంతు సభాప్రాంగణమంతా మారుమోగింది. ఉలిక్కిపడ్డాడు మహాభిషుడు.

''నేటి నీ ప్రవర్తన నా సభకు తగినది కాదు. ఎన్ని పుణ్యకర్మలు ఆచరించినా, భూలోకపు పోకడలు ఇంకా నిన్ను వీడిపోలేదు. తిరిగి నువ్వు అక్కడే జన్మించు!''

మహాభిషుడు ఇంతవరకు పొందిన ఆనందం పటాపంచలైంది. అయినా తను విచారించదలచుకోలేదు. దేవగంగ సౌందర్యాలోకనభాగ్యం తనకు కలి

గింది. తిరిగి భూలోకంలో జన్మించినా, ఉత్తమ స్థితిని పొందాలి తను. మహాభిషుడు తల ఎత్తి బ్రహ్మ వంక సానునయంగా చూశాడు.

"తమ శాపం నాకు అజ్ఞాతుల్యమే. కానీ ఒక్క మనవి. భూలోకంలో ధర్మప్రభువైన ప్రదీప మహారాజు కుమారుడుగా జన్మించే యోగ్యత అనుగ్రహించండి, చాలు."

మహాభిషుడి కోరికలో దురాశ కనపడలేదు బ్రహ్మకి. పైగా మహాభిషుడి శీలసంపదలు, ధర్మబుద్ధి బ్రహ్మకు తెలియనివి కావు. తన సభా మర్యాదను అతిక్రమించినందుకు శిక్షించినా, అతని విన్నపానికి ఆమోదం సూచించాడు బ్రహ్మ.

బ్రహ్మకు నమస్కరించి మహాభిషుడు వెనుదిరుగుతుంటే, గంగ రూపసౌందర్యవంతుడైన మహాభిషుని సానురాగంగా వీక్షించింది. బ్రహ్మదేవుడి ఆగ్రహానికి కారణం తనే. యజ్ఞ యాగాదులు చేసి మహత్తర శక్తిసమన్వితుడై బ్రహ్మలోకాన్ని చేరిన మహాభిషుడు తన సౌందర్యారాధన కారణంగా తిరిగి భూలోకంలో జన్మించటం గంగ మనసును కదిలించింది. తన సౌందర్యాన్ని వీక్షించే కాంక్షతో, తను సాధించినదంతా పోగొట్టుకుందుకు సిద్ధపడ్డాడే ఈ మహాభిషుడు- ఎంతటి త్యాగమూర్తి! రూపం, గుణం, ధర్మం, త్యాగం అన్నీ కలిసిన సంపూర్ణమైన వ్యక్తి. తనను అంతగా ఆరాధిస్తున్న వ్యక్తికోసం తనేమీ చేయలేదా?

మనసులో పరిపరి విధాల తలపోసింది గంగ. మహాభిషుడి వంటివానితో జీవించడం కంటే తనకి సార్థకత మరేముంటుంది? అంతకు మించిన అనుభూతి మరేముంది? గంగకు అతని వ్యక్తిత్వంపైన గౌరవాభిమానాలు పెరిగిపోయాయి అతని చూపుల్ని ఆమె గుండెల్లో దాచుకుంది.

"మహారాజా, నా కారణంగా మీరు భూలోకంలో పునర్జన్మ పొందితే..."

మహాభిషుడు వెనక్కి తిరిగాడు.

గంగ తన వెంట వస్తోంది. గంగ కిలకిల నవ్వింది.

"నేనూ భూలోకంలో మీ కోసం జన్మిస్తాను. మీ వంటి ప్రేమైకమూర్తి లభించటం నా భాగ్యం. మీతో సహజీవనం చేయటమే నా అభిలాష."

గంగాదేవి దేవలోకాన్ని వీడి పయనం సాగించింది.

ఆమె ప్రేమానురాగాలు పరవశుణ్ణి చేశాయి మహాభిషుణ్ణి.

*

(ఆధారం : కవిత్రయం వారి శ్రీమదాంధ్ర మహాభారతం: ఆదిపర్వం : చతుర్థాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక : 13-1-1988)